చేసిన సేవలు గుర్తింపునిస్తాయి



దుర్గారావును సన్మానిస్తున్న ఉప కమిషనర్ మల్లారెడ్డి

కుత్బుల్లాపూర్: ఉద్యోగులు తాము ప్రజలకు చేసిన సేవలు గుర్తింపునిస్తాయని గాజులరామారం సర్కిల్ ఉప కమిషనర్ మల్లారెడ్డి అన్నారు. శానిటేషన్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ పొందిన పాత్తూరి దుర్గారావు ఆత్మీయ వీడ్కోలు సమావేశాన్ని శనివారం సర్కిల్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన్ని శాలువతో సత్కరించి అభినందించారు. రిటైర్‌మెంట్‌తో జీవితం ముగిసిపోదని, సామాజిక సేవలో భాగస్వామం కావాలన్నారు. కార్యక్రమంలో ఏఎంహెచ్‌ఓ మమత, పారిశుద్ధ్య విభాగం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



చెక్కులు అందజేస్తున్న కార్పొరేటర్ జగన్

కుత్బుల్లాపూర్: సంక్షేమ పథకాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కార్పొరేటర్ జగన్ అన్నారు. శనివారం చింతల్‌లోని బీఆర్ఎస్ కార్యాలయంలో ధనలక్ష్మికి (2 లక్షలు), కృష్ణ బిట్టుకి (లక్ష), భాగ్యలక్ష్మికి(రూ.2 లక్షలు), ఆఫ్రీన్ బేగంకు (రూ.2 లక్షలు) చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ డివిజన్ల అధ్యక్షులు రుద్ర అశోక్, ఎర్ర శంకరయ్య, వేంకటేశ్వర దేవస్థానం మాజీ చైర్మన్ వేణు యాదవ్, సీనియర్ నాయకులు సుధాకర్, లక్ష్మీనారాయణ, మెట్ల శీను పాల్గొన్నారు.

ఘనంగా ఫ్రెషర్స్‌డే



సుభాష్‌నగర్: కుత్బుల్లాపూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ఫ్రెషర్స్ డే శనివారం ఘనంగా జరిగింది. సీనియర్ విద్యార్థులు నృత్య ప్రదర్శనలతో ఫస్ట్ ఇయర్ విద్యార్థులకు స్వాగతం పలికారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ నాగేందర్ మాట్లాడుతూ.. ర్యాగింగ్‌కు తావివ్వకుండా జూనియర్ విద్యార్థులతో స్నేహపూర్వకంగా మెలగాలన్నారు. సీనియర్లు జూనియర్లకు ఆదర్శంగా ఉంటూ ఉత్తమ ఫలితాల సాధనతో కళాశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో అధ్యాపక సిబ్బంది ఉపేందర్, పరశురామ్, వెంకటేష్, అజిత్, మనోహర్, సాయికృష్ణ, శివశంకర్ పాల్గొన్నారు.

వ్యాపారికి బెదిరింపులు.. !

పలువురు రిపోర్టర్లపై కేసు..

ఇద్దరి రిమాండ్

సాక్షి, మేడ్చల్‌జిల్లా: మట్టి వ్యాపారిపై బెదిరింపులకు పాల్పడిన ముగ్గురు రిపోర్టర్లపై శామీర్‌పేట్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సిద్దిపేట జిల్లాకు చెందిన మట్టి వ్యాపారి చాగర్ల శివకుమార్ మూడుచింతలపల్లి మండలం అనంతారం గ్రామంలో మట్టి వ్యాపారం సాగిస్తుంటాడు. కాగా శామీర్‌పేట్‌కు చెందిన ముగ్గురు రిపోర్టర్లు పలుమార్లు వారిని బెదిరించి డబ్బులు వసూలు చేయసాగారు. అంతటితో ఆగకుండా గత మార్చి నెలలో మరోసారి లారీలను అడ్డగించి డబ్బులు వసూలు చేయడంతో పాటు ఫారెస్ట్ అధికారులతో లారీని సీజ్ చేయించి వ్యాపారికి నష్టం కలిగించారు. ఇలా పలుసార్లు వ్యాపారిపై సదరు వ్యక్తులు బెదిరింపులకు పాల్పడటంతో మనస్థాపానికి గురైన వ్యాపారి జూన్‌లో ఇంట్లో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. అప్రమత్తమైన కుటుంబసభ్యులు ఆస్పత్రికి తరలించడంతో కొద్ది రోజులు చికిత్స తీసుకుని ప్రాణాలతో బయటపడ్డాడు. తిరిగి వ్యాపారం కొనసాగిస్తున్న క్రమంలో 29న సదరు రిపోర్టర్లు నారాయణపూర్ స్కూల్ వద్ద మరోసారి లారీని అడ్డగించి రూ.20వేలు డిమాండ్ చేయడంతో పాటు డ్రైవర్‌పై దాడి చేసి, వాహనం తాళాలు, సెల్‌ఫోన్ బలవంతంగా లాక్కున్నారు. ఫిర్యాదుదారుడిపై తప్పుడు కేసులు పెట్టిస్తామని, కొడతామని బెదిరించడంతో విసుపోయిన అతడు శామీర్‌పేట్ పోలీసులను ఆశ్రయించాడు. దీంతో ముగ్గురిపై కేసు నమోదు చేసిన పోలీసులు శనివారం ఇద్దరిని రిమాండ్‌కు తరలించారు.

తాగునీరు వృథా..

తప్పదు వృథ!

- పైపులైన్ లీకేజీలతో వృథాగా నీరు
- పట్టించుకోని అధికారులు





బహుదూర్‌పల్లి చౌరస్తాలో ఏడాది కాలంగా వృథాగా పోతున్న గోదావరి జలాలు

చింతల్: అధికారుల నిర్లక్ష్యం వల్ల వందలాది కిలోమీటర్ల నుంచి నగరానికి వస్తున్న తాగునీరు మురుగునీటిలో కలుస్తోంది. దీంతో గుక్కెడు నీటి కోసం పేద ప్రజలు అల్లాడుతుంటే అధికారులు మాత్రం నీటి లీకేజీలపై ఉదాసీనత వ్యవహరిస్తుండటంతో లక్షలాది రూపాయల ప్రజాధనాన్ని తాగునీటి రూపంలో పోనిస్తున్నారు. దీంతో ఏడాదికాలంగా 24 గంటల పాటు విలువైన తాగునీరు రోడ్డు పాలవుతుంది.

లీకేజీ ఏడాదికి పైగానే..

బహదూర్ పల్లి నుంచి షాపూర్ నగర్‌కు ఉన్న 600 పైపులైన్ లీకేజీ ఏర్పడింది. ఈ నీరు దుండిగల్ ఎయిర్ పోర్ట్‌కు వెళ్తుందని అక్కడ స్థానికులు పేర్కొంటున్నారు. కాగా ఈ పైపులైన్‌కు మరమ్మతులు చేపట్టాల్సిన ట్రాన్స్ మిషన్ అధికారులు పట్టించుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. అదేవిధంగా మెయింటెనెన్స్ విభాగంలో కొంపల్లి సెక్షన్‌కు అనుబంధంగా ఉన్న ఈ పైపులైన్‌పై ఇక్కడి అధికారులు కూడా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. దీంతో ఏడాదికి పైగా మీరు రోడ్డుపై పారి మురుగు నీటిలో కలుస్తుందని స్థానికులు ఆరోపిస్తున్నారు.

పది రోజులు తిరగకుండానే లీకేజీ..

ఐడీపీఎల్ సిగ్నల్ వద్ద వారం రోజుల క్రితం స్థానికంగా ఉన్న జలమండలి అధికారుల పర్యవేక్షణలో లీకేజీకి మరమ్మతులు చేపట్టారు. కానీ శనివారం మధ్యాహ్నం మరల లీకేజీ ఏర్పడడం వారి పనితీరుకు నిదర్శనంగా మారింది.

రెండు నెలలుగా ఎస్టిమేషన్ దశలోనే..

షాపూర్‌నగర్‌లోని ఎం.పి.ఆర్ కాంప్లెక్స్ వద్ద ఉన్న నాలా పైన ఉన్న 450 ఎం ఎం పైపులైన్‌కు లీకేజీ ఏర్పడింది. ఈ నీరు ఎయిర్ ఫోర్స్ కాలనీకి సరఫరా అవుతుంది. కానీ అధికారులు రెండు నెలలుగా మరమ్మతుల కోసం ఎటువంటి చర్యలు తీసుకోలేదు. రెండు నెలలుగా ఎస్టిమేషన్ నుంచి ఒక కాంట్రాక్టర్‌కు అప్పగించే దశలోనే ఉండడంతో తాగునీరు వృథాగా పారుతోంది. అధికారులు స్పందిస్తారో? లేదో? వేచి చూడాల్సిందే.



ఐడీపీఎల్ వద్ద పైపులైన్‌కు లీకేజీతో..



షాపూర్‌నగర్‌లో 450 ఎంఎం పైపులైన్‌కు లీకేజీ..

ఫ్లాట్ల కొనుగోలుదారులకు అండగా ఉంటా

ఎంపీ ఈటల రాజేందర్



మాట్లాడుతున్న ఎంపీ ఈటల రాజేందర్

నిజాంపేట్: రిటైర్‌మెంట్ డబ్బులతో అపార్ట్‌మెంట్‌లో ఫ్లాట్లు కొనుగోలు చేసిన వారిని మోసం చేయడం ధర్మం కాదని, సదరు కన్‌స్ట్రక్షన్ కంపెనీ యాజమాన్యంపై కోర్టులో కొట్లాడతానని ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. శనివారం బాచుపల్లిలో ఫసిఫికా కన్‌స్ట్రక్షన్ – ఆవాస్ నెబ్యూలా అపార్టుమెంట్ వద్ద ఫ్లాట్ల కొనుగోదారులు చేపట్టిన ఆందోళనకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రైవేట్ కంపెనీలు, ఉద్యోగ విరమణ అయిన ఉద్యోగులు మొత్తం 2724 మంది ఫ్లాట్లు కొనుగోలు చేశారని, వారిని ఫసిఫికా కన్‌స్ట్రక్షన్స్ యాజమాన్యం మోసం చేసిందన్నారు. కోర్టుల్లో కేసులు వేసి, బౌన్సర్లతో యాజమాన్యం బాధితులను భయభ్రాంతులకు గురి చేస్తోందని ఆరోపించారు. బౌన్సర్లు ఎవరిమీదైనా చేయి చేసుకుంటే చట్టపరమైన చర్యలు తప్పవన్నారు

మేధో సంపత్తి హక్కులపై అవగాహన

బాలానగర్: జేఎన్‌టీయూహెచ్ గోల్డెన్ జూబ్లీ హాల్‌లో శనివారం మేధో సంపత్తి హక్కులపై ఒక్కరోజు వర్క్ షాపు నిర్వహించారు. కార్యక్రమాన్ని జేఎన్‌టీయూహెచ్, తెలంగాణ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ సంయుక్తంగా నిర్వహించాయి. టీఎస్‌సీఓఎస్‌టీ, ఐసీఏఆర్, సీఎస్ఐఆర్, ఐఐసీటీ నుంచి రిసోర్సు పర్సన్లు హాజరయ్యారు. ఐసీఏఆర్ మాజీ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ కల్పన శాస్త్రి హాజరై సమాజ ప్రయోజనాల కోసం ఆవిష్కరణలను ప్రభావితం చేసే ఐపి మేనేజ్‌మెంట్ స్ట్రాటజీల గురించి అవగాహన కల్పించారు. భారత ప్రభుత్వ భారతీయ పేటెంట్ కార్యాలయంలో మాజీ అసిస్టెంట్ కంట్రోలర్ ఆఫ్ పేటెంట్స్ అండ్ డిజైన్స్ సైంటిస్టు డా. రాజు గుర్రపు పేటెంట్ల రకాలు, దరఖాస్తు విధానం, ప్రాసిక్యూషన్, కమర్షియలైజేషన్ గురించి వివరించారు. కార్యక్రమంలో శాశ్వత ఫ్యాకల్టీ సభ్యులు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, రీసెర్చ్ స్కాలర్స్, పీజీ విద్యార్థులు, జూనియర్ అసిస్టెంట్లు, ప్రిన్సిపాల్ డాక్టర్ జీ.వి. నరసింహారెడ్డి, డైరెక్టర్ ప్రొఫెసర్ ఎం.వి.ఎస్.ఎస్. గిరిధర్ పాల్గొన్నారు.

ఆలయ సమీపంలో చెత్త డంపింగ్



కుత్బుల్లాపూర్: బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయకూడదని అధికారులు అవగాహన కల్పిస్తున్నా డంపింగ్ మాత్రం ఆగడం లేదు. ఎం.ఎస్.రెడ్డినగర్‌లోని హనుమాన్ ఆలయం సమీపంలో రోడ్డు పక్కన చెత్త డంప్ చేస్తున్నారు. దీంతో తీవ్ర దుర్వాసన వస్తుందని ఆలయానికి వచ్చే భక్తులు వాపోతున్నారు. గుడిని ఆనుకునే చెత్త సేకరణ బండ్లు నిలుపుతున్నారని, సదరు ఇన్‌చార్జీలకు తెలిపినా పట్టించుకోవడం లేదని కాలనీ అసోసియేషన్ ప్రెసిడెంట్ కర్నే శ్యామ్ తెలిపారు. ఆదివారం గణేష్ నిమజ్జనం, అన్నదాన కార్యక్రమాలున్న సందర్భంగానైనా చెత్తను తరలించాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

సాంకేతికతపై విద్యార్థులకు అవగాహన



కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

దుండిగల్: మర్రి లక్ష్మణ్‌రెడ్డి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాల ఆధ్వర్యంలో దుండిగల్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సాంకేతిక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ప్రేర్ణ ఔట్రీచ్ పేరుతో నేషనల్ కౌన్సిల్ ఫర్ సైన్స్ అండ్ టెక్నాలజీ కమ్యూనికేషన్ సహకారంతో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థుల రోజు రోజువారీ జీవితంలో సైన్స్, టెక్నాలజీ పాత్ర గురించి ఆసక్తి కలిగించి వారిని భవిష్యత్‌లో నిష్ణాతులుగా తీర్చిదిద్దే విధంతో పాటు వారి జిజ్ఞాసతో శాస్త్రీయ ఆలోచనను మేళవించి రూపొందించిన కార్యకలాపాలపై వివరించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు అరుణ్‌కుమార్, బలరామ్, హెచ్‌ఎం ఆర్ ముత్యంగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రేషన్‌కార్డుదారులు ఈ–కేవైసీ పూర్తి చేసుకోవాలి

డీఎస్‌ఓ శ్రీనివాస్‌రెడ్డి

సాక్షి,మేడ్చల్ జిల్లా: మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలోని రేషన్ కార్డు లబ్ధిదారులు ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం తమ వేలిముద్ర సాయంతో 100 శాతం ఈ–కేవైసీ పూర్తి చేసుకోవాలని జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారి (డీఎస్‌ఓ) శ్రీనివాస్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలో మొత్తం 5,37,810 రేషన్‌కార్డులకు సంబంధించి 18,65,353 మంది లబ్ధిదారులు ఉండగా.. ఇప్పటి వరకు 13,19,111 (70.72శాతం) మంది లబ్ధిదారులు మాత్రమే ఈ–కేవైసీ పూర్తి చేసుకున్నారని వివరించారు. మిగతా 5,46,242 (29.28శాతం) మంది లబ్ధిదారులు ఈ–కేవైసీని పూర్తిచేసుకోవాల్సి ఉందన్నారు. మిగిలిన వారంతా సెప్టెంబర్‌లో తాము నివసించే ప్రాంతంలో అందుబాటులో ఉన్న రేషన్‌షాపునకు వెళ్లి తమకు సంబంధించిన ఈ–కేవైసీని పూర్తి చేసుకోవాలని ఆయన కోరారు. 5 ఏళ్ల పూర్తి కాని పిల్లలకు ఈ–కేవైసీ నుంచి మినహాయింపు ఇవ్వబడిందన్నారు. రేషన్‌షాపు డీలర్లు కూడా రేషన్‌షాపులను తెరిచి ఉంచి ఈ–కేవైసీ పూర్తి చేసేందుకు సహకరించాలని ఆయన కోరారు.

గుర్తు తెలియని మహిళ మృతి

సుభాష్‌నగర్: గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యమైన ఘటన సూరారం పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. శనివారం నారాయణ హాస్పిటల్ ముందున్న శక్తి కాంప్లెక్స్‌లో గుర్తుతెలియని మహిళ మృతదేహం ఉందని స్థానికులు సూరారం పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో సీఐ సుధీర్‌కృష్ణ తన సిబ్బందితో వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. సదరు మహిళ స్థానికంగా భిక్షాటన చేసేదని, అనారోగ్యం కారణంగా మృతి చెంది ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మహిళలు స్వశక్తితో ఎదగాలి



స్టాళ్లను పరిశీలిస్తున్న కమిషనర్ వెంకటేశ్వర్ నాయక్

దుండిగల్: మహిళలు స్వశక్తితో ఎదగాలని, ఆర్థికంగా అభివృద్ధి సాధించాలని దుండిగల్ మున్సిపల్ కమిషనర్ ఎం.వెంకటేశ్వర్ నాయక్ అన్నారు. వంద రోజుల ప్రణాళికలో భాగంగా మహిళా పొదుపు సంఘాల సభ్యులు, వీధి వ్యాపారులు ఫుడ్ ఫెస్టివల్‌ను నిర్వహించారు. ఇందులో భాగంగా వారు తయారు చేసిన తిను బండారాలు, చేతి వృత్తుల వస్తువులను ఆయన పరిశీలించి మాట్లాడారు. మహిళలు వ్యాపారాలు చేసుకునేందుకు బ్యాంక్ ద్వారా రుణాలను అందిస్తామని, అదే విధంగా వీధి వ్యాపారులు ప్రభుత్వం అందించే పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మెప్మా సీఓ మంజుల, మహిళా రిసోర్స్ ప్రతినిధులు రాణి, అరుణ, ఆదిలక్ష్మి, నాగమణి, మౌలాబి, నూర్జత్, ఉమా, మహిళా పొదుపు సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

రాకపోకలకు ఆటంకంగా ట్రాన్స్‌ఫార్మర్



కమ్యూనిటీ భవనం వద్ద రోడ్డుపై ఉన్న తాత్కాలిక ట్రాన్స్‌ఫార్మర్

రంగారెడ్డినగర్: విద్యుత్ అధికారుల తీరు రాకపోకలకు ఆటంకంగా మారుతోంది. రంగారెడ్డినగర్ డివిజన్ పరిధి గురుమూర్తినగర్ కమ్యూనిటీ భవనం సమీపంలో వారం రోజులుగా తాత్కాలిక విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ రోడ్డుపైనే ఉంచారు. ఏదైనా ట్రాన్స్‌ఫార్మర్‌లో సాంకేతిక సమస్యలు తలెత్తిన సమయంలో సరఫరాలో అంతరాయం ఏర్పడకుండా తాత్కాలిక ట్రాన్స్‌ఫార్మర్ సేవలను వినియోగిస్తారు. అయితే ఎటువంటి సమస్య లేకపోయినా రోడ్డుపై ట్రాన్స్‌ఫార్మర్‌ను వదిలేయడం విమర్శలకు తావిస్తోంది. అసలే చిన్న రోడ్డు కావడంతో ఒక భారీ వాహనం వెళితే మరో వాహనం ముందుకు సాగలేని పరిస్థితి. తాత్కాలిక ట్రాన్స్‌ఫార్మర్ రోడ్డును సగం ఆక్రమించడంతో రాకపోకలకు ఇబ్బందికరంగా మారిందని స్థానికులు పేర్కొంటున్నారు. వారం రోజులుగా వదిలేసిన ట్రాన్స్‌ఫార్మర్‌ను ఇక్కడి నుంచి తరలించాలని గురుమూర్తినగర్ వాసులు కోరుతున్నారు.

ముగిసిన చేతిరాత శిక్షణ శిబిరం



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

సుభాష్‌నగర్: అందమైన చేతిరాత విద్యార్థుల్లో ఆత్మ విశ్వాసాన్ని పెంచుతుందని హెల్పింగ్ హార్ట్స్ సొసైటీ అధ్యక్షుడు విజయ్‌కుమార్ అన్నారు. రెండు వారాలుగా జితేందర్ హ్యాండ్ రైటింగ్ అకాడమీ ఆధ్వర్యంలో సూరారం కాలనీలోని జడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో జరుగుతున్న ల్యూసిడా చేతిరాత శిక్షణా శిబిరం శనివారం ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల హెడ్ మాస్టర్ యాదగిరి, జితేందర్ హ్యాండ్ రైటింగ్ అకాడమీ డైరెక్టర్ మల్లయ్య, ఉపాధ్యాయులు హనుమంత్ రావు, జావిద్, పుణ్యవతి, యాదగిరి పాల్గొన్నారు.

కెరీర్ గైడెన్స్‌పై విద్యార్థులకు అవగాహన



కార్యక్రమంలో పాల్గొన్న సంస్థ ప్రతినిధులు

నిజాంపేట్: లైఫ్ చారిటబుల్ ట్రస్ట్, ఒరాకిల్ కంపెనీ ఆధ్వర్యంలో ప్రగతి నగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు కెరీర్ గైడెన్స్, హెల్త్ ఎడ్యుకేషన్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పోటీ ప్రపంచంలో విద్యార్థులు ఎలాంటి కోర్సులు ఎంచుకోవాలి, వారి లక్ష్యాన్ని చేరుకోడానికి ఏ మార్గాలు అనుసరించాలి అనే విషయాలను వివరించారు. అదే విధంగా మంచి ఆరోగ్యం కోసం విద్యార్థులు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి అనే విషయాన్ని వివరించారు. కార్యక్రమంలో డాక్టర్ కె.ప్రశాంత్ కుమార్, హెచ్‌ఎం చెన్నయ్య, ఉపాధ్యాయులు, ఒరాకిల్ సంస్థ ప్రతినిధులు కిషన్, సతీష్, శ్రీనివాస్ పాల్గొన్నారు

గణేష్ మహరాజ్‌కి జై !

మండపాల వద్ద పూజలు, హోమాలు

నియోజకవర్గ వ్యాప్తంగా గణేశ్ ఉత్సవాలు అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. మండపాల వద్ద శనివారం గణనాథులకు విశేష పూజలతో పాటు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. పలు మండపాల వినాయకులను నిమజ్జనాలకు మేళతాళాల మధ్య తరలించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

– కుత్బుల్లాపూర్



జగద్గిరిగుట్టలోని సృజన యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలోని వినాయకుడి పూజలో భక్తులు



కుత్బుల్లాపూర్‌లో పూజలో పాల్గొన్న డీసీసీ మాజీ అధ్యక్షుడు కేఎం ప్రతాప్



దూలపల్లి రామాలయంలో గణపతి హోమంలో బూర్గుబావి సత్యనారాయణ



దేవేందర్‌నగర్ గాలిపోచమ్మ బస్తీలో..



సూరారం నార్త్‌సిటీ హైస్కూల్‌లో దేవతా మూర్తుల వేషధారణలో విద్యార్థులు



సూరారం కాలనీలోని వినాయకుడి వద్ద పూజలో పాల్గొన్న భక్తులు



బహదూర్‌పల్లి మున్సిపల్ కార్మికుల ఆధ్వర్యంలోని వినాయక నిమజ్జనంలో పాల్గొన్న కోలాటం కళాకారులు, కార్మికులు